సాక్షి తిరుపతి

మంగళవారం ၊ 9 ၊ మే ၊ 2023



నిండు ప్రాణం బలి

లైన్‌మన్ నిర్లక్ష్యంతో తాత్కాలికంగా విద్యుత్ పనులు చేస్తున్న ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. -8లో



ట్రాన్స్‌కోకు రూ.10 లక్షల నష్టం

వర్షం కారణంగా చంద్రగిరి నియోజకవర్గంలో ట్రాన్స్‌కోకు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	38	25
చిత్తూరు	37	25
తిరుమల	34	21
గూడూరు	39	27
నగరి	39	26

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ఇండియన్ నేవీలో షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ ఉద్యోగాలకు అర్హులైన అవివాహిత మహిళలు, పురుషుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. తొమ్మిది బ్రాంచిలలో వివిధ క్యాడర్లలో అండర్ గ్రాడ్యుయేట్, డిగ్రీ చేసిన అభ్యర్థులు అర్హులని, అయితే కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలని, ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ముందుగా అధికారిక పోర్టల్ www.jointindianavy.gov.in ను విజిట్ చేసి హోం పేజీలోకి అక్కడ అవసరమైన వివరాలతో రిజిస్టర్ అవ్వాలని, తర్వాత లాగిన్ అయి అప్లికేషన్ పూర్తి చేయాలని తెలిపారు. చివరిగా అప్లికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు ఫారంను సబ్మిట్ చేయాలని సూచించారు. పదేళ్ల పాటు షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్‌గా సేవలందించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,876 మంది స్వామివారిని దర్శించుకోగా.. 30,695 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ కనకనరసారెడ్డి

పాకాల: మండలంలోని ఓబులశెట్టివారిపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న మెడికల్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఆర్డీఓ కనక నరసారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఆయన సదర్శించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఇలాంటి క్యాంప్‌ను దేశంలో ఎక్కడా నిర్వహించలేదని, ఇంతటి మంచి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 43 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం మామూలు విషయం కాదన్నారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఈసీజీ, రక్త పరీక్షల శిబిరాలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన ఉండాలి

తిరుపతి అర్బన్: విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, పదవ బెటాలియన్, విజయవాడ వారు జిల్లా వ్యాప్తంగా ఈ నెల23 వరకు విపత్తులపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా వరదలు వచ్చే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలు, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు విపత్తు నిర్వహణ బృందాలు రాక ముందు స్థానికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సదస్సుల్లో అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, ట్రాఫిక్ డీఎస్పీ నర్సప్ప పాల్గొన్నారు.

స్పందనకు 66 ఫిర్యాదులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 66 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

మా ఊరి జాతర

జాతర. రాయలసీమ జిల్లాలో ఊరూరా ప్రతి ఏటా ఘనంగా జరుపుకునే స్థానిక పండుగ. గ్రామస్తులంతా చందాలు వేసుకుని వారం రోజుల పాటు జరుపుకునే ఈ జాతర పురుడు పోసుకుంది తిరుపతిలోనే. సీమ జిల్లాల్లోనే అత్యంత వేడుకగా తిరుపతిలో నిర్వహించే ఈ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. తిరుపతి, చిత్తూరులో గంగజాతర జరుపుకునేందుకు నేడు చాటింపు వెయ్యనున్నారు. చాటింపు అంటే.. జాతరకు రమ్మని పిలుపునివ్వడం. అసలు జాతర ఎందుకు చేస్తారు? జాతర ముందు చాటింపు ఎందుకు వేస్తారు? తదితరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ఊరి సరిహద్దుల్లో తోరణాలు.. పొలిమేర పూజలు
- తిరుపతి, చిత్తూరు గంగ జాతరకు నేడు చాటింపు
- చాటింపు వేశారంటే ఎవ్వరూ ఊరు దాటకూడదు
- రాయలసీమలో నేటికీ కొనసాగుతున్న ఆచార, సంప్రదాయాలు



ఢం.. ఢం.. ఢం
ఇది గంగ జాతర
చాటింపు
ఊరూవాడా బాగుండాలి
ఎవ్వరూ ఊరు వదిలి
వేరొక ఊరికి వెళ్లకూడదు
జనమంతా ఊరు పొలిమేరల్లోపే ఉండాలి
చిన్న చిప్పలో ఆముదంతో
దీపం వెలిగించాలి
యముడితో వాదులాడి
దున్నపోతును తేవాలి
శివుడితో వాదులాడి సింహాన్ని తెచ్చి
వచ్చే మంగళ, బుధవారం
గంగజాతరహో..

సాక్షి, తిరుపతి: రాయలసీమ జిల్లాలు నాడు కరువు కాటకాలతో అల్లాడిపోయేవి. వేసవి వచ్చిందంటే గుక్కెడు మంచినీటికీ కరువే. అదే సమయంలో కలరా.. ప్లేగు వంటి వ్యాధులు జనాన్ని భయపెట్టేవి. ఊరు, వాడా తేడాలేకుండా మంచపట్టేది. పలువురు మృత్యువాతపడేవారు. అటువంటి సమయంలో ఊరు పెద్దలంతా ఏకమై ఒక నిర్ణయానికి వచ్చేవారు. గంగమ్మ తల్లికి పూజలు చేయాలని నిర్ణయించేవారు. అందుకోసం ఒకపెద్ద బండ రాయిని తీసుకుని దానిపై 'ఓం లేదా స్వస్తిక్' గుర్తును చెక్కేవారు. అలా చెక్కిన బండకు పసుపు, కుంకుమ పెట్టి వేపాకు చుడుతారు. చాకలి తెచ్చి ఇచ్చే ఒక తెల్లగుడ్డను చుట్టి 'గంగమ్మ తల్లి' అని వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసేవారు. అంటు వ్యాధులు ప్రబలకుండా.. వ్యాధులతో బాధపడే వారిని మృత్యువాత నుంచి గట్టెక్కించమని, వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థించేవారు.

చాటింపుతో.. అష్టదిగ్బంధనం

నాడు సెల్‌ఫోన్ సౌకర్యం ఉండేది కాదు. బస్సులు, రైళ్లు అంతంత మాత్రమే. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఊరి వాళ్లను గంగ జాతర ప్రారంభమైంది.. రమ్మని పిలిచేందుకు చాటింపు వేసి ఊరుని అష్టదిగ్బంధనం చేస్తారు. జాతర సమయంలో ఏరోజు ఏమి చేయాలో అదే రోజు నిర్ణయిస్తారు. అదెలా అంటే.. మంగళవారం రాత్రి ఊరు పొలిమేరల్లో ప్రత్యేకంగా ముగ్గులు వేసి కొబ్బరికాయ కొట్టి కుంకుమ కలిపిన నిమ్మకాల్ని కోసి నలువైపులా పిండి హారతి ఇస్తారు.

గెరిగ ఊరేగింపుగా వెళ్తారు. ఆ గెరిగకు చుట్టూ పసుపు, కుంకుమపెట్టి వేప మండలు చుడుతారు. తోటి వాడి సాయంతో దండోరా వేస్తూ.. జాతర తేదీలను తెలియజేస్తూ ఊరు పొలిమేరల్లో తిరుగుతారు. ఊరుకి నాలుగు పొలిమేర్లలో ప్రత్యేక పూజలు చేసి హద్దు తోరణాలు కట్టి అష్టదిగ్బంధనం చేస్తారు. దుష్ట శక్తులు ఆవహించకుండా..అమ్మవారి జాతర ప్రశాంతంగా జరగాలని పూజలు నిర్వహిస్తారు. ఈ తంతు పూర్తయిన తర్వాత నడివీధిలో గెరిగెను పెట్టి సంప్రదాయ పద్ధతిలో పూజలు చేస్తారు. చాటింపు వేసి పొలిమేర్లలో హద్దు తోరణాలు కడితే ఊరుదాటి బయటకు వెళ్లకూడదన్నది ఆచారం. అలా బయటకు వెళితే చెడు జరుగుందని గ్రామ పెద్దలు చెబుతున్నారు.

తిరుపతి, చిత్తూరు హద్దులు ఇవే..

తాతయ్యగుంట గంగమ్మ గుడి (హెడ్ పోస్టాఫీస్ వీధి చివర్లో). చింతకాలయ వీధి, కర్నాలవీధి (కూడలి), బేరివీధి, గాలివీధి ముందు కూడలి. నేటి రాత్రి చాటింపు వేసే ముందు కైకాలవారు పెద్దకాపు వీధిలో పదిమంది రెడ్లకు చాటింపు విషయాన్ని తెలియజేస్తారు. మొదట బేరివీధి, కర్నాలవీధి మలుపులో ఉన్న పురాతన రాతి మండప ఆలయం ముందు చాటు పూజ చేస్తారు. ఈ రాతి మండపాన్ని 'చాటు మండపం' అని పిలుస్తా రు. రెండు అడుగుల రుబ్బురాయి ఆకారంలో ఉన్న నల్లని శిల (పోతురాజు) మండపం నుంచి వెలుపలకు తీసుకొచ్చి బొట్లుపెట్టి మల్లెపూలతో అలంకరించి రోడ్డుపక్కన ఉంచుతారు. చిత్తూరులో తేనెబండ, సంతపేట శివాలయం, కట్టమంచి చెరువు, గంగినేని పార్కు వద్ద శక్తిమారియమ్మ ఆలయం హద్దులు.





దప్పు కొట్టి చాటింపు వేస్తున్న దృశ్యం (ఫైల్)

మంగళవారం మంగళకరం

మంగళవారం రోజు అంటే మంగళకరమైన రోజు అని పెద్దల మాట. అదేవిధంగా గంగమ్మ శక్తి దేవత కావడం.. ఆమెకు మంగళవారం ఇష్టం కనుక అదే రోజు చాటింపు వేస్తారని చెబుతున్నారు. ఊరి బాగు కోసం చేసే కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని చాటింపుని మంగళవారం రాత్రి నిర్వహించడం ఆనవాయితీ. సీమ జిల్లాలో ఎక్కడైనా మంగళవారం రాత్రే చాటింపు వేయడం ఆనవాయితీ.

గంగమ్మ పుట్టింటి సారెతో జాతర చాటింపు

గంగమ్మతల్లి పుట్టినిల్లు అయిన అవిలాల గ్రామం నుంచి మంగళవారం రాత్రి తిరుపతిలోని శ్రీతాతయ్యగుంట గంగమ్మకు పుట్టింటి సారె అత్యంత వేడుకగా సాగనుంది. అమ్మవారికి సారె తీసుకొచ్చి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం జాతర ఉత్సవాల్లో ప్రధాన పాత్రదారులైన కైకాల వారు మంగళవారం అర్ధరాత్రి నగరంలోని చాటు మండపంలో పూజలు నిర్వహించి, నాలుగు దిక్కుల అష్టబంధనం చేసి డప్పుతో నగరంలో జాతర చాటింపు చేయనున్నారు. ఈ చాటింపుతో గంగమ్మ జాతర సంబరాలు ఆరంభం కానున్నాయి.

రాష్ట్ర పండుగగా గంగజాతర

తిరుపతి తాతయ్యగుంట గంగ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవదాయశాఖ, టీటీడీ నిధులతో గంగమ్మ తల్లికి నూతన ఆలయాన్ని నిర్మించి కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్రస్వామి చేతుల మీదుగా మహాకుంభాభిషేకం నిర్వహించడం మరో విశేషం.

గ్రామదేవత లేని ఊరు ఎక్కడా ఉండదు



గ్రామదేవతలు లేని ఊరు ఎక్కడా ఉండదు.. చూడలేదు. ఈ దేవతలకు కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా పూజలు, తిరునాళ్లు, జాతరలు జరిపిస్తుంటారు. ఈ జాతర 'యాత్ర' అనే శబ్దం నుంచి ఉద్భవించింది. చుట్టుపక్కల ఉండేవారంతా ఒకచోటుకు యాత్రలాగా వెళ్లి ఉత్సవాన్ని జరుపుకోవడమే జాతర. గ్రామదేవతలు వేరైనా వారిని ఆరాధించే విధానంలో కొంత తేడా కనిపించినా బలులు ఇచ్చే విధానం దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఇంచు మించు ఒకే విధంగా ఉంటుంది.

– శ్రీనివాసులురెడ్డి (పేటశ్రీ), ప్రొఫెసర్, ఎస్వీయూ, తిరుపతి.

గరుత్మంతునిపై శ్రీహరి కటాక్షం

- ఉదయం మోహినీ అవతారంలో అభయమిచ్చిన శ్రీనివాసుడు
- శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- నాగలాపురంలో వేడుకగా వేదనారాయణుని బ్రహ్మోత్సవాలు



గరుడ వాహనంపై విహరిస్తున్న లోకనాయకుడు

పిచ్చాటూరు: వైకుంఠనాథునికి అత్యంత ప్రీతిమంతమైన గరుత్మంతునిపై లోకనాయకుడైన శ్రీ వేదనారాయణ స్వామి విహరిస్తూ సోమవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన వాహన సేవ అయిన గరుడ సేవ అత్యంత వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామి నాగలాపురం తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటి నమ్మకం. గరుడ వాహన సేవను పురస్కరించుకొని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భజన బృందం కోలాటాలు తిరువీధుల్లో స్వామివారి ముందు సాగుతూ భక్తులను అలరింపజేసింది. చివరిగా స్వామివారి నిజాలయానికి వేంచేసి ఏకాంత సేవ నిర్వహించారు.

శోభాయమానంగా ఊంజల్ సేవ

ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఉత్సవమూర్తులకు మహా మండపంలో ఆశీనులు చేసి వేద పండితులు శ్రీసూక్తం, భూసూక్తం, పురుషసూక్తం, నీలసూక్తం, నారాయణసూక్తాలను పటిస్తుండగా అర్చకస్వాములు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం 7 గంటలకు మత్స్య అవతారుడైన శ్రీ వేదనారాయణుని విశేష అలంకరణలు చేసి రాములవారి మండలంలోని ఊయలపై ఆసీనులు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి ఊంజల్ అత్యంత వైభవంగా నిర్వహించారు.

నేడు హనుమంత, గజ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం హనుమంత వాహన సేవ, రాత్రి గజ వాహన సేవ నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 7 గంటలకు ఊంజల్ సేవ జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు.



మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న వేదనారాయణ స్వామి

మోహినీ అవతారంలో శ్రీనివాసుడి అభయం

సోమవారం ఉదయం మోహినీ అవతారంలో శ్రీనివాసుడు ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. నిత్యకైంకర్యాలనంతరం వాహన మండపంలో శ్రీవారిని అర్చకులు మోహినీ అవతారంలో అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు స్వామివారికి కర్పూర, పూర్ణకుంభ హారతులు సమర్పించారు. మాయా జగత్తు నుంచి బయటపడేయటమే మోహినీ రూపం పరమార్థం అని భక్తులు విశ్వసిస్తారు.

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



సంక్షేమ క్యాలెండ్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

తిరుపతి అర్బన్: సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ రూపొందించిన 'జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023–24'ని సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలను ఈ క్యాలెండర్‌లో పొందుపరచారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీనివాసరావు, జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య, డీపీఆర్‌ఓ విజయసింహారెడ్డి, ఏపీఓ వెంకటరమణ, ఎస్డీసీలు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలెండర్ ఇలా..

- మే 2023 – వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్(మొదటి విడత), వైఎస్సార్ ఉచిత పంటల బీమా, జగనన్న విద్యాదీవెన (మొదటి విడత), వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా (మొదటి త్రైమాసికం), వైఎస్సార్ మత్స్యకార భరోసా.
- జూన్ 2023 – జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ లా నేస్తం (మొదటి విడత), మిగిలిపోయిన లబ్ధిదారులకు లబ్ధి
- జులై 2023 – జగనన్న విదేశీ విద్యాదీవెన (మొదటి విడత), వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు, జగనన్న తోడు (మొదటి విడత), వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ), వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీతోఫా (రెండో త్రైమాసికం)
- ఆగస్టు 2023 – జగనన్న విద్యాదీవెన (రెండో విడత), వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహన మిత్ర
- సెప్టెంబర్ 2023 – వైఎస్సార్ చేయూత
- అక్టోబర్ 2023 – వైఎస్సార్ రైతుభరోసా – పీఎంకిసాన్ (రెండో విడత), జగనన్న వసతి దీవెన (మొదటి విడత)
- నవంబర్ 2023 – వైఎస్సార్ సున్నావడ్డీ – పంట రుణాలు, వైఎస్సార్ కల్యాణమస్తు– షాదీతోఫా (మూడవ త్రైమాసికం), జగనన్న విద్యాదీవెన (మూడవ విడత)
- డిసెంబర్ 2023 – జగనన్న విదేశీ విద్యాదీవెన (రెండో విడత), జగనన్న చేదోడు, మిగిలిపోయిన లబ్ధిదారులకు లబ్ధి
- జనవరి 2024 – వైఎస్సార్ రైతుభరోసా – పీఎం కిసాన్ (మూడో విడత), వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు (రెండో విడత), వైఎస్సార్ లా నేస్తం (రెండో విడత), పెన్షన్ల పెంపు (నెలకు రూ.3000)
- ఫిబ్రవరి 2024 – జగనన్న విద్యాదీవెన (నాల్గో విడత), వైఎస్సార్ కల్యాణమస్తు –షాదీతోఫా (నాల్గో త్రైమాసికం), వైఎస్సార్ ఈబీసీ నేస్తం
- మార్చి 2024 – జగనన్న వసతి దీవెన (రెండో విడత), ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు

విద్యార్థినికి కలెక్టర్ అభినందనలు



ధ్రువితారెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో శ్రీకాళహస్తి మండలం, తొండమనాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని చెవిరెడ్డి ధ్రువితారెడ్డి టాపర్‌గా నిలిచింది. బీఎస్ కండ్రిగ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ చెవిరెడ్డి రమేష్‌రెడ్డి తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. టాపర్‌గా నిలవడంతో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆమెను కలెక్టర్ అభినందించారు. ఈ ఫలితాల్లో జిల్లాకు 8వ స్థానం రావడం వెనుక విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. అనంతరం విద్యార్థినిని డీఈఓ డాక్టర్ వి.శేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. సీఎంఓ జి.సురేష్, ఏఎంఓ శివశంకరయ్య, డిస్ట్రిక్ ఆల్టర్నేటివ్ స్కూల్ కో–ఆర్డినేటర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్–2023

- తిరుపతి, గూడూరులో పరీక్షా కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపల్ ద్వారకనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఆ కళాశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలో తిరుపతిలో 8, గూడూరులో 8, మొత్తం 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ 16 కేంద్రాల్లో 4,957 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రంలోకి ఉదయం 10 నుంచే విద్యార్థులను అనుమతిస్తామని, బ్యాగులు, పర్సులు, మొబైల్ ఫోన్లు, క్యాలికులేటర్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్, ఒరిజినల్ ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదన్నారు.

తిరుపతిలో పరీక్షా కేంద్రాలివే..

కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న ఎస్‌జీఎస్ ఉన్నత పాఠశాల, బాలాజీ కాలనీలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్, ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్పీడబ్ల్యూ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్పీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్పీ డబ్ల్యూ జూనియర్ కళాశాల.

గూడూరులో పరీక్షా కేంద్రాలివే

తిలక్ రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ సెరామిక్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డీఎస్పీ కార్యాలయం సమీపంలోని బాలుర జెడ్పీపీ హైస్కూల్, డీఆర్‌డబ్ల్యూ కళాశాల, బాలికల జెడ్పీపీ హైస్కూల్, బైపాస్ రోడ్డులోని ఆదిశంకర పాలిటెక్నిక్ కళాశాల, ఆదిశంకర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కాలేజ్.

అమ్మవారి సేవలో సినీ నటి గౌతమి



ఆలయం ఎదుట సినీ నటి గౌతమి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి సినీ నటి గౌతమి సోమవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కు కుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆర్టీసీలో ఆన్ కాల్ డ్రైవర్లుగా అవకాశం

రేణిగుంట: ఏపీ ఎస్ఆర్టీసీ శ్రీకాళహస్తి డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు. హెవీ లైసెన్స్ కలిగి ఉండి, కనీసం 18 నెలల అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

లైన్‌మన్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి

- మోపూరు సబ్ స్టేషన్ వద్ద మృతదేహంతో బంధువుల నిరసన


మోపూరు సబ్‌స్టేషన్‌లో మృతదేహంతో నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) నగేష్ (ఫైల్)


స్థానికులతో చర్చిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

డక్కిలి: లైన్‌మన్ నిర్లక్ష్యం కారణంగా తాత్కాలికంగా విద్యుత్ పనులు చేస్తున్న ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మోపూరురోడ్డు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, అధికారుల కథనం.. మండలంలోని మోపూరు రోడ్డు దళితవాడకు చెందిన మద్దూరి నగేష్ అలియాస్ మహేష్ (23), నరేంద్ర మోపూరు లైన్‌మన్ కోటేశ్వరరావు వద్ద తాత్కాలిక హెల్పర్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం కోటేశ్వరరావు మోపూరుకు చెందిన ఓ రైతు పొలం వద్ద మోటారు కనెక్షన్ ఇవ్వాలని వారిద్దరికీ ఫోన్‌చేసి చెప్పడంతో వారు అక్కడికి చెరుకున్నారు. స్తంభం ఎక్కే ముందు లైన్‌మన్ లింగసముద్రం ఫీడర్ ఎల్‌సీలో ఉందని, స్తంభం ఎక్కి మరమ్మత్తులు చేయాలని వారికి ఫోన్‌లో తెలియజేశాడు. దీంతో నగేష్ వెంటనే స్తంభం ఎక్కి మరమ్మత్తులు చేసేందుకు ప్రయత్నించగా ఎల్‌సీ లేక పోవడంతో ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని తన మిత్రుడు నరేంద్ర వెంటనే లైన్‌మెన్ కోటేశ్వరరావుకు సమాచారం ఇవ్వడంతో అతను పరారయ్యాడు. వాస్తవానికి సబ్‌స్టేషన్ సిఫ్ట్ అపరేటర్ మోపూరు ఫీడర్‌కు ఎల్‌సీ కావాలని లైన్‌మన్ కోరినట్లు సబ్ స్టేషన్‌లో ఉన్న బుక్‌లో నమోదు చేశారు. అయితే మృతుడు నగేష్ లింగసముద్రం ఫీడర్‌లో మరమ్మత్తులు చేసేందుకు స్తంభం ఎక్కారు. ఈ సంఘటనలో లైన్‌మన్ నిర్లక్ష్యంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఈ మేరకు మృతదేహంతో సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు బాధితులను ఓదార్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విషయం తెలుసుకున్న వెంకటగిరి ట్రాన్స్‌కో డీఈఈ మునిరవిచంద్ర, డక్కిలి, వెంకటగిరి రూరల్, వెంకటగిరి టౌన్ ఏఈఈ జహీర్ అహ్మద్, అశోక్‌రెడ్డి, జయచంద్రారెడ్డి మోపూర్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని మృతుని కుటుంబ సభ్యలతో మాట్లాడారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, మృతుని కుటుంబ సభ్యలకు ఆర్థిక సాయం అందేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో బంధువులు నిరసను విరమించారు. తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డక్కిలి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఒక్కగానొక్క కుమారుడు దూరం

మోపూరురోడ్డు దళితవాడకు చెందిన నాగరాజు, వెంకటమ్మ దంపతులకు ఒకే ఒక్క కుమారుడు నగేష్. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూ వరికోత మిషన్ డ్రైవర్‌గా, ప్రయివేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

లైన్‌మన్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

మోపూరురోడ్డు సెంటరు సమీపంలోని పొలాల్లో సోమవారం జరిగిన విద్యుత్ ప్రమాదంపై ట్రాన్స్‌కో ఏఈఈని జహీర్‌అహ్మద్‌ను వివరణ కోరగా లైన్‌మెన్ కోటేశ్వరరావు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, ఈ విషయం తమ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. ఏ ప్రాంతంలో అయినా విద్యుత్ సమస్య వస్తే ఆప్రాంతానికి చెందిన లైన్‌మెన్ మాత్రమే ఎల్‌సీ తీసుకుని మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. అయితే కొందరు నిర్లక్ష్యంగా ప్రయివేటు వ్యక్తులను విద్యుత్ మరమ్మత్తుల కోసం వినియోగించడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,010
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,659
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,400
రిటైల్ వెండి గ్రాము	రూ.80.40

నేడు రాష్ట్ర జట్టు ఎంపిక


క్రీడాకారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : మోడ్రన్ పెంటాథలాన్ లేజర్ రన్ క్రీడ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను మంగళవారం ఉదయం 6గంటల నుంచి తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఆ మేరకు మోడ్రన్ పెంటాథలాన్ రాష్ట్ర సంఘం చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వివిధ జిల్లాల నుంచి బాలబాలికలు హాజరవుతున్నట్లు తెలిపారు. బాలబాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన బాలురు ఆరుగురు, బాలికలు ఆరుగురు, మొత్తం 12మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో పూణెలో నిర్వహించనున్న జాతీయ స్థాయి మోడ్రన్ పెంటాథలాన్ పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అనంతరం ఎంపిక పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను క్రీడాకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యనిర్వాహక కార్యదరిశ కె.కృష్ణ, పీడీలు దశరథన్, మహేష్, మురళి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ


స్వామివారి పల్లకీసేవ

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం, ఊరందూరులోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం రాత్రి పల్లకీసేవ కన్నులపండువగా జరిగింది. శ్రీకాళహస్తి దేవస్థాన అనుబంధ ఆలయమైన చెన్నకేశవస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు విశేష పుష్పాలంకరణ చేసి పల్లకీలో ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆనంద నిలయం వీడియో చిత్రీకరణ

తిరుమల: తిరుమలలో ఆనంద నిలయాన్ని వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని సీవీఎస్వో నరసింహ కిషోర్ సోమవారం తెలిపారు. టీటీడీ నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లడం, వీడియో చిత్రీకరించడం నేరమన్నారు. అయితే ఆదివారం రాత్రి తిరుమలలో భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఆ సమయంలోనే సదరు భక్తుడు పెన్ కెమెరా ద్వారా వీడియో చిత్రీకరించినట్టు అనుమానిస్తున్నామన్నారు.

కూడు, గూడు కల్పనే లక్ష్యం


గజమాలతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు


కురవపల్లెలో మోహిత్‌రెడ్డికి అన్నం పెడుతున్న మహిళ

- అదే సీఎం జగనన్న అజెండా
- మహాపాదయాత్రలో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

భాకరాపేట: ప్రతి ఒక్కరికీ కూడు, గూడు కల్పించడమే సీఎం జగనన్న అజెండా అని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గడపగడపకు మహాపాదయాత్రలో భాగంగా సోమవారం జంగావాండ్లపల్లి పంచాయతీ పరిధి నుంచి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. గజమాలతో ఆత్మీయంగా సత్కరించారు. ప్రతిగడపలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందించి వైఎస్ఆర్సీపీకి అండగా నిలవాలని కోరారు. మహా పాదయాత్ర కురవపల్లి, చినిగేపల్లి, జంగామాండ్లపల్లి, కూనివాండ్లపల్లి, అప్పేపల్లి, బొడేరెడ్డి గారి పల్లి వరకు కొనసాగింది. చిన్నగొట్టిగల్లు మండలం పరిధిలో పది గ్రామాలు కలయికతో జంగావాండ్లపల్లి పంచాయతీ ఏర్పాటైంది. ఇక్కడ 561 నివాసాలు 1,561 మంది జనాభా ఉన్నారు. పంచాయతీ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొత్తం రూ.6 కోట్ల, 55 లక్షల, 76వేల, 530 రూపాయలు మంజూరు చేసినట్టు మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రతి కుటుంబం రూ.1.5 లక్షకు పైగా లబ్ధి పొందిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి, డీసీఎంఎస్ సహదేవ్‌రెడ్డి, జెడ్పీటీసీ స్వరూపా, సర్పంచ్ విమల, ఉపసర్పంచ్ రఘునాథరెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, పార్టీ డివిజనల్ అధ్యక్షులు అక్బర్, మహేంద్ర రెడ్డి, పంచాయతీ కన్వీనర్‌లు జైపాల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ఎంపీడీఓ దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరీ, ట్రాన్స్‌కో ఏడీ శివయ్య, పశుసంవర్ధక శాఖ ఏడీ అవులప్రసాద్, సీఐ తులసీరామ్, ఎస్ఐ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ట్రాన్స్‌కోకు రూ.10 లక్షల నష్టం


ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేస్తున్న సిబ్బంది

తిరుపతి రూరల్: చంద్రగిరిలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. వర్షానికి తోడు పిడుగులు పడడంతో చంద్రగిరి, శ్రీకాళహస్తి, బీఎన్ కండ్రిగ, వెదురుకుప్పం, తిరుపతి రూరల్, రేణిగుంట ప్రాంతాల్లో 19కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. రెండు కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. 35 విద్యుత్ పోల్స్ నేలకూలాయి. తూర్పు మండలాల్లో చాలా ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది వర్షంలోనూ యుద్ధప్రతిపాదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. విద్యుత్ మరమ్మత్తుల కారణంగా చంద్రగిరితో సహా పలు మండలాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు విద్యుత్ అధికారులు తెలిపారు.

చెస్‌తో ఏకాగ్రత

- 26 నుంచి తిరుపతిలో రాష్ట్ర స్థాయి ఓపెన్ పోటీలు
- చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వెల్లడి


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్: చెస్‌తో ఏకాగ్రత పెరుగుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం యూత్ హాస్టల్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలను చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ దివాకర్‌రెడ్డి ప్రారంభించారు. చిన్నప్పటి నుండే చెస్ క్రీడను అలవర్చుకోవడం వల్ల క్రమశిక్షణ, ఏకగ్రత అలవడుతుందన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి సరదాగా చెస్ ఆడారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన పురుషులు, మహిళా క్రీడాకారులకు జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పురుషులకు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసనూరి మాట్లాడుతూ మహిళలకు విజయవాడలో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు తెలిపారు. అసోసియేషన్ నాయకులు శర్మ, కిరణ్, బాలాజీచౌదరి, అనిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పురుషుల విభాగంలో: యతిన్‌రెడ్డి, త్రిపురాంబికా, లతీష్‌రెడ్డి, పార్థసాయి

మహిళల విభాగంలో: మోడీతరెడ్డి, ఝూన్సీ, మహాలక్ష్మి, గురువాక్షిని

అర్జీలను సకాలంలో పరిష్కరించండి


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డీఆర్వో శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 153 అర్జీలు అందగా అందులో ఒక్క రెవెన్యూశాఖకు సంబంధించిన వినతులే 107 వరకు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి

రేణిగుంట: రేణిగుంట- శ్రీకాళహస్తి మార్గం, గురవరాజుపల్లి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పూజారి అక్కడికక్కడే మృతి చెందాడు. రేణిగుంట ఎస్ఐ ఈశ్వరయ్య కథనం.. మండలంలోని గురవరాజుపల్లి వద్దనున్న మహదేవ ఆశ్రమంలో పూజారిగా రాజేష్‌గిరి స్వామి(82) పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి ఆశ్రమం ఎదురుగా ఉన్న హోటల్‌లో పార్సిల్ కట్టించుకుని రోడ్డు దాటుతుండగా, తిరుపతి వైపు నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న తమిళనాడుకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని ఆపకుండా వెళ్లింది. ఈ ప్రమాదంలో పూజారి రాజేష్‌గిరి స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. తర్వాత పోలీసులు ఏర్పేడు వద్ద బస్సును స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వైభవంగా వేయి లింగేశ్వరస్వామి తిరుణాల


హాజరైన భక్తులు


శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

డక్కిలి: మండలంలోని ఆముదూరు పంచాయతీ కొలితోటలో ఉన్న వేయిలింగేశ్వరస్వామి తిరుణాల సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, స్వామివారి గ్రామోత్సవం, నైవేద్య ప్రసాద వినియోగం చేశారు. కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజన, రాత్రి శివ పార్వతుల కల్యాణం, అన్నదానం, అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. సత్యహరిచంద్ర నాటకం ప్రదర్శించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.